సనాతన ధర్మంలో అసమానతల్లేవు


పుస్తకం ఆవిష్కరిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి


చెన్నై, న్యూస్‌టుడే: సనాతన ధర్మంలో అసమానతలు లేవని గవర్నర్ ఆర్.ఎన్.రవి తెలిపారు. హిందూ ఆధ్యాత్మిక గురువు వళ్లలార్ 201వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిండిల రాజ్‌భవన్‌లోని ఆయన విగ్రహానికి శనివారం నివాళులర్పించారు. వళ్లలార్ సందేశాలకు సంబంధించి రాసిన 'తిరువరుట్ప ఉరైనడై' పుస్తకాన్ని రాజ్‌భవన్ ప్రాంగణంలో గవర్నర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కొందరు సనాతన ధర్మాన్ని కులంతో పోల్చి మాట్లాడుతూ తప్పుడు అవగాహన కలిగి ఉన్నారన్నారు. కులం చూసేవారు సనాతనవాదులు కాదన్నారు. ప్రధాని మోదీ వళ్లలార్ మార్గంలో నడుస్తున్నారని, సనాతన మార్గంలో అందరికీ సమానంగా నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలకు ఒకే విధమైన రైలు మార్గం తదితర పలు సమధర్మ ప్రాజెక్టులనూ చేపడుతున్నారని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో టీకాలను పలు దేశాలకు ఉచితంగా అందించి కారుణ్యాన్ని చాటారన్నారు. చెన్నై మెట్రోరైలు ప్రాజెక్టుకు నిధులనూ వళ్లలార్ మార్గంలోనే మంజూరు చేశారని చెప్పారు.

సమధర్మాన్ని కొనియాడుదాం
ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: జీవుల్లో భేదం, అసమానతలు చూడని సమధర్మాన్ని కొనియాడదామని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి చెందిన హిందూ ఆధ్యాత్మిక గురువు వళ్లలార్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి తన 'ఎక్స్' పేజీలో సందేశం పోస్టు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం నుంచి 'తనిపెరుంకరుణై నాళ్'గా వళ్లలార్ జయంతి నిర్వహిస్తోందని తెలిపారు. 'మనసులో ఒకటి ఉంచుకుని, బయటకు మరొకటి మాట్లాడేవారి బంధాలు వైదొలగాలి. మతమనే దెయ్యం పట్టకుండా ఉండాలి' అంటూ వళ్లలార్ చూపిన మార్గాన్ని సదా అనుసరిద్దామని పిలుపునిచ్చారు.

జీవనశైలిలో మార్పులతో ఆరోగ్యకర జీవితం

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు


రోబోటిక్ శస్త్రచికిత్సను వెంకయ్యనాయుడికి వివరిస్తున్న భక్తవత్సలం, వైద్యులు

వడపళని, న్యూస్‌టుడే: జీవనశైలిలో మార్పులు అనుసరిస్తే ఆరోగ్యకరంగా ఉండొచ్చని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కోయంబత్తూరులో శనివారం జరిగిన 'రోబోటిక్ హార్ట్ సర్జరీ' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్యరంగం రోబోటిక్, సాంకేతిక విధానంతో అభివృద్ధి చెందుతూ, అన్నివర్గాల వారికి అనుకూలమైన చికిత్సలందించే దిశగా సాగుతోందన్నారు. కేంద్రం సీనియర్ సిటిజన్లకు బీమా సదుపాయం అందుబాటులోకి తీసుకురావడం శుభ పరిణామమన్నారు. సమాజానికి వైద్యసేవలతో పేరు తెచ్చుకుంటున్న కేజీ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ, ఛైర్మన్, డాక్టర్ జి.భక్తవత్సలాన్ని ప్రశంసించారు. వైద్యరంగంలో కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో వస్తున్న సదుపాయాలు అందరికీ ఉపయోగకరంగా ఉండాలన్నదే ధ్యేయమని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేకమందిలో హృద్రోగ సమస్యలు కనిపిస్తున్నాయని వెంకయ్యనాయుడు తెలిపారు. అందులో 27 శాతం మంది మృత్యువాత పడుతున్నారని, అవగాహన లేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జీవనశైలి సరిగా లేకపోవడం, మధుమేహం, అధిక ఒత్తిడితో గుండె సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. ఆహార నియమాలు సక్రమంగా అనుసరించాలని సూచించారు. వెంకయ్యనాయుడికి డాక్టర్ భక్తవత్సలం జ్ఞాపిక అందజేశారు.

11 నుంచి చెన్నైకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్


మాట్లాడుతున్న ఎంపీ మురసోలి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ మీదుగా తిరుచ్చి-చెన్నై మధ్య ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ 11 నుంచి నడవనుందని తంజావూర్ ఎంపీ మురసోలి తెలిపారు. తంజావూర్‌లో శనివారం విద్యార్థులకు విద్యారుణాలు అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రైల్వే బడ్జెట్ చర్చలో తాను నాలుగు ముఖ్యమైన వినతులు ప్రస్తావించానని చెప్పారు. అందులో ఇంటర్‌సిటీ నడపడం ఒకటి అన్నారు. తిరుచ్చి నుంచి తంజావూర్ మీదుగా చెన్నైకు సోమ, గురువారం తప్ప మిగిలిన రోజుల్లో పగటిపూట ఇంటర్‌సిటీ రైలు నడపనున్నట్లు దక్షిణ రైల్వే మేనేజర్ తెలిపారన్నారు.

స్మార్ట్ తరగతులు.. ప్రోత్సాహక నగదు



విద్యాశాఖలో అమలు చేస్తున్న కొత్త పథకాలతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చక్కటి మేలు చేకూరుతోంది. విద్యార్థుల చేరిక కూడా పెరుగుతోంది. విద్యాశాఖ అభివృద్ధికి రూ.7,500 కోట్లతో 'ప్రొఫెసర్ అన్బళగనార్ పల్లి మెంబాట్టు తిట్టం' పథకాన్ని ఐదేళ్లపాటు అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నాబార్డ్ రుణ పథకం కింద 614 పాఠశాలలకు రూ.1,086 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభమై కొనసాగుతున్నాయి.
- న్యూస్‌టుడే, ఆర్కేనగర్

ప్రభుత్వ పథకాలతో విద్యార్థులకు లబ్ధి

సాంకేతికతతో బోధన..

- టెక్స్ట్‌బుక్ కార్పొరేషన్, ఎడ్యుకేషనల్ సర్వీస్ కార్పొరేషన్ తరపున మాధ్యమిక, ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో రూ.394.89 కోట్లతో 8,209 హైటెక్ ల్యాబొరేటరీల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. 2024-25 ఏడాదిలో 654 ప్రభుత్వ సాయం పొందే మహోన్నత పాఠశాలలో ల్యాబొరేటరీల ఏర్పాటుకు రూ.41.856 కోట్లు కేటాయించారు.
- విద్యార్థులకు బోధన, అభ్యాస ప్రక్రియను సులభతరం చేయడానికి స్మార్ట్ తరగతులను పాఠశాలలో అమలు చేస్తున్నారు. 2021-22లో 865 ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో స్మార్ట్ తరగతుల ఏర్పాటుకు రూ.20.76కోట్లు, 2022-23 ఏడాదిలో 12,500 ప్రాథమిక పాఠశాలలకు రూ.230 కోట్లు, 2023-24 ఏడాదిలో 7,500 ప్రాథమిక పాఠశాలలకు రూ.150 కోట్లు కేటాయించారు. 2024-25 విద్యా సంవత్సరంలో 6,179 ప్రభుత్వ మాధ్యమిక, ఉన్నత, మహోన్నత పాఠశాలకు స్మార్ట్ తరగతులకు ఏర్పాటుకు రూ.117.401 కోట్లు కేటాయించారు.

సీఎం అల్పాహార పథకం

ముఖ్యమంత్రి అల్పాహార పథకం 2022 సెప్టెంబరు 15న ప్రారంభించారు. ఈ సంవత్సరం జులై 15 నుంచి ప్రాథమిక పాఠశాలలకు కూడా పథకాన్ని విస్తరించారు. మొత్తంగా 20 లక్షల మందికిపైగా విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. 2023-24 ఏడాదిలో అటవీ, కొండ గ్రామాల్లోని 27,707 మంది విద్యార్థులు పాఠశాలలకు సురక్షితంగా వెళ్లేందుకు రవాణాసౌకర్యం కాపలాదారులతో అందుబాటులోకి తెచ్చారు.

నాన్ ముదల్వన్ తిట్టం

నాన్ ముదల్వన్ తిట్టం కింద 9 నుంచి 12 తరగతుల వరకు చదివిన విద్యార్థులకు ఉన్నతవిద్య, వృత్తి, ఉద్యోగవకాశాలపై మార్గదర్శకాలు ఇవ్వడంతో 10లక్షల మందికి పైగా ప్రయోజనం కలిగింది. ముఖ్యమంత్రి ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా 11వ తరగతి చదువుతున్న వెయ్యిమంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రోత్సహక నగదుగా నెలకు రూ.వెయ్యి చొప్పున యూజీ కోర్సు వరకు అందిస్తున్నారు.

పుదుమైపెన్..

ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సాయం పొందే పాఠశాలలో 6 నుంచి 12వ తరగతి వరకు చదివి ఉన్నతవిద్యకు వెళ్లే విద్యార్థినులకు నెలకు రూ.వెయ్యి అందించే పథకం 'పుదుమైపెన్ తిట్టం'. విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి అందించే పథకమే 'తమిళ్ పుతల్వన్ తిట్టం'. రెండు పథకాలతో దాదాపు 6లక్షల మందికిపైగా లబ్ధి పొందుతున్నారు.

ఉపాధ్యాయులకు ల్యాప్‌టాప్‌లు

ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న 79,723 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మారుతున్న అభ్యాస, బోధనా పద్ధతులకు అనుగుణంగా రూ.101.48కోట్ల ఖర్చుతో ల్యాప్‌టాప్‌లు అందించారు.


హెయిర్ ఫర్ హోప్ ప్రచారంలో భాగంగా కీమోథెరపీతో జుట్టు కోల్పోయే క్యాన్సర్ రోగులకు విగ్ తయారుచేసేందుకు చెన్నైలోని ఎతిరాజ్ మహిళా కళాశాల ప్రాంగణంలో శనివారం వెంట్రుకలు దానంగా అందిస్తున్న విద్యార్థినులు
– న్యూస్‌టుడే, ఆర్కేనగర్

రాష్ట్రంలో భారీ వర్షాలకు అవకాశం

ప్యారిస్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం శనివారం ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరాలను ఆనుకుని ఉన్న మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఆదివారం తమిళనాడులోని అనేక ప్రాంతాల్లో, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడు, దిండుక్కల్, తేని, సేలం, నామక్కల్, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూరు, కరూర్, తిరుచ్చి, మదురై, విరుదునగర్, శివగంగై, పుదుక్కోట్టై తదితర జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీవర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. 7న రాష్ట్రంలో అనేక చోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడు, దిండుక్కల్, తేని, సేలం, పుదుక్కోట్టై జిల్లాల్లో భారీవర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. 8న తేదీ నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూర్, దిండుక్కల్, ఈరోడు, సేలం, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో, 9న నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, దిండుక్కల్, తేని, విరుదునగర్, తెన్‌కాశి, తిరునెల్వేలి, కన్నియాకుమరి, కృష్ణగిరి జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతమై కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తుందని వెల్లడించింది.

ఆకట్టుకుంటున్న సెల్ఫీ పాయింట్



విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఊటీలోని సెల్ఫీ పాయింట్ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. 2,500 తాగునీటి ఖాళీ సీసాలతో 'ఐ లవ్ ఊటీ' సెల్ఫీ పాయింట్‌ను చేరింగ్‌క్రాస్ ఆడమ్స్ ఫౌంటెయిన్ వద్ద ఏర్పాటు చేశారు. సందర్శకులు దీనిముందు నిల్చుని ఉత్సాహంగా ఫొటోలు దిగుతున్నారు. 'స్వచ్ఛ భారత్' ప్రారంభించి పదేళ్లైన నేపథ్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తాగునీటి ఖాళీ సీసాలను సేకరించి సెల్ఫీ పాయింట్ సిద్ధం చేశారు.

టీచర్ సైకిల్ దొంగిలించి నడిపా

పుదుచ్చేరి సీఎం రంగసామి


దర్శకుడు కమల్‌కన్నన్‌కు అవార్డు అందిస్తున్న రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పిల్లలు మంచి నేర్చుకునే కథలతో సినిమాలు తీయాలని పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, నవదర్శన్ ఫిల్మ్‌గ్రూప్, ఆలయన్స్ ఫ్రాన్సెస్ సంయుక్తంగా ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా 2023కు ఉత్తమచిత్రంగా 'కురంగు పెడల్' అనే తమిళచిత్రాన్ని ఎంపిక చేశారు. దర్శకుడు కమల్‌కన్నన్‌కు 'శ్రీ శంకరదాస్ స్వామి' అవార్డు అందించే కార్యక్రమం శనివారం పుదుచ్చేరిలోని అలయన్స్ ఫ్రాన్సెస్ కలైయరంగంలో జరిగింది. రూ.లక్ష నగదు బహుమతి అందించి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సినిమాల ద్వారా ప్రజల్లో మంచి ఆలోచనలు వస్తున్నాయన్నారు. అప్పట్లో ఉపాధ్యాయుడి సైకిల్ దొంగలించి తీసుకెళ్లి నడిపిన అనుభవం తనకు ఉందన్నారు. అప్పట్లో సైకిల్ కొనుగోలు చాలా కష్టంగా ఉండేదని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా సైకిల్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సైకిల్ నడిపితే చక్కటి వ్యాయామంగా ఉంటుందన్నారు. పిల్లలు సినిమాలు చూసి చాలా విషయాలు నేర్చుకుంటున్నారని, చక్కటి కథలతో తెరకెక్కించాలని కోరారు.


పథకాలను ప్రారంభిస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

టీకాలపై వదంతులా?

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి డీపీటీ టీకాపై వదంతులు వ్యాప్తి చేస్తున్నారని ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ తెలిపారు. ఐదేళ్లలోపు 20లక్షల మంది పిల్లలకు 17వేల టీకాలు ఏడాదికి కావాలన్నారు. టీకాలు కేంద్రమే కొనుగోలు చేస్తుందని, ఇప్పటికే మూడుసార్లు లేఖలు రాశామన్నారు. టీకాలు లేక పిల్లలను తిప్పిస్తున్నట్లు ఈపీఎస్ ఆరోపిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 3,26,000 టీకాలు నిల్వ ఉన్నాయని చెప్పారు. చెన్నై అడయారు అర్బన్ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో పిల్లల సంక్షేమ పథకాలను శనివారం మంత్రి ప్రారంభించారు. పేరెంటింగ్ యాప్, గర్భిణులకు గుర్తింపుకార్డులను అందించారు. మేయర్ ప్రియ, వేళచ్చేరి ఎమ్మెల్యే హసన్ మేళలానా, మండల కమిటీ అధ్యక్షుడు దురైరాజ్ పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత వేగవంతం చేయండి


సమీక్ష నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నై, శివారు ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాల వర్షాలకు ప్రజలు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా యుద్ధప్రాతిపదికన తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చెన్నై సచివాలయంలో శనివారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ నేతృత్వంలో సమీక్ష జరిగింది. గతంలో చేపట్టి ఆగిపోయిన వాననీటి కాలువల నిర్మాణాలు పూర్తి చేయాలని, కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని నిర్ణయించారు. వరదల్లో చిక్కుకొనే ప్రజలను కాపాడటానికి పడవలు సిద్ధంగా ఉంచడం, విద్యుత్తు కేబుళ్ల ఏర్పాటు పనులు, తాగునీటి కుళాయిలు అమర్చే పనులు త్వరలో ముగించాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. వాననీరు నిల్వ ఉండకుండా తోడటానికి మోటారు పంపులు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, మంత్రులు ఏవీ వేలు, కేఎన్ నెహ్రూ, టీఎం అన్బరసన్, వి.సెంథిల్ బాలాజీ, శేఖర్ బాబు, మా.సుబ్రమణియన్, చెన్నై మేయర్ ఆర్.ప్రియ, చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

వాతావరణ హెచ్చరికలు ఎలా చేస్తారు?

వేళచ్చేరి: చెన్నై ఎళిలగంలో 24 గంటలూ పని చేసే రాష్ట్ర విపత్తుల హెచ్చరిక కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పరిశీలించారు. కేంద్రం పనితీరు, ప్రజల ఫిర్యాదులపై సిబ్బంది తీసుకునే చర్యలు, వర్షపాతం నమోదు, వాతావరణ ముందస్తు హెచ్చరికలపై రెవెన్యూ కార్యదర్శి అముద వివరించారు. గురువారం కొత్తగా ప్రారంభించిన టీఎన్ అలర్ట్ మొబైల్ యాప్ పని తీరును ఉదయనిధి స్టాలిన్ తెలుసుకున్నారు. మంత్రి రామచంద్రన్, కేంద్రం ఎండీ వి.మోహనచంద్రన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డీఆర్‌బీసీసీసీలో అంతర్జాతీయ సదస్సు


సంచిక ఆవిష్కరణలో నిర్వాహకులు, అతిథులు

వడపళని, న్యూస్‌టుడే: ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కణ్ణన్ చెట్టి హిందూ కళాశాలలో(డీఆర్‌బీసీసీసీ) 'వికసిత భారత్ 2047' అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. వాణిజ్యశాఖ, కార్పొరేట్ సెక్రటరీషిప్, అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్, బ్యాంక్ మేనేజ్‌మెంట్ విభాగాలు 'ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్'తో కలిసి అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేశాయి. యూఏఈ స్కైలైన్ యూనివర్సిటీ కళాశాల మార్కెటింగ్ విభాగ ఆచార్యులు డాక్టర్ షణ్ముగం జోషి ప్రారంభోపన్యాసం చేశారు. కళాశాల ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ పెరుమాళ్, సంచాలకులు డాక్టర్ ఎన్.రాజేంద్రనాయుడు, ప్రధాన అధ్యాపకులు డాక్టర్ జి.కల్విక్కరసి ముఖ్య అతిథులను సత్కరించారు. అతిథులు సదస్సు సంచికను ఆవిష్కరించారు. హరియాణాకు సహ ఆచార్యులు డాక్టర్ సి.వెంకటేశ్వరన్, చెన్నై నందనం ప్రభుత్వ ఆర్ట్స్ సైన్సు కళాశాల ఆచార్యులు, రీసెర్చి సూపర్‌వైజర్ డాక్టర్ వి.రామానుజం తదితర పలువురు వక్తలు సాంకేతిక సెషన్లు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అధ్యాపకులు, పరిశోధకులు, వాణిజ్య, బిజినెస్ విభాగాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్పాదక వాణిజ్య, నిర్వహణపై చర్చలు జరిగాయి.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి

రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే వ్యతిరేక పవనాలు

ఎస్పీ వేలుమణి

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా డీఎంకే వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, దీన్ని అన్నాడీఎంకే సద్వినియోగం చేసుకుంటే 2026లో ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చని అన్నాడీఎంకే మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి పేర్కొన్నారు. ఆయన కోవైలో శనివారం పార్టీలో కొత్తగా చేరిన వారికి సభ్యత్వ కార్డులు అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ఆస్తి పన్ను, విద్యుత్తు ఛార్జీలు పెంచడంతో పేద, సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్లు ఎందరో ఉండగా ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడంతో ముఖ్యమంత్రి స్టాలిన్ సొంత పార్టీలో వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రాష్ట్ర ప్రజలు కూడా దీన్ని అంగీకరించడం లేదన్నారు. ఇలా అన్ని రంగాల్లో విఫలమైన డీఎంకే ప్రభుత్వం త్వరలో కూలిపోయే అవకాశం ఉందని జోస్యం చెప్పారు.

యూట్యూబ్ ఛానెల్ ప్రారంభంపై శిక్షణ

వడపళని, న్యూస్‌టుడే: గిండిలోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్ (ఈడీఐఐ)లో 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ క్రియేట్ యువర్ ఓన్ యూట్యూబ్ ఛానెల్ అండ్ ఆన్‌లైన్ మార్కెటింగ్' అంశంపై మూడు రోజుల పాటు శిక్షణ జరగనుంది. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు శిక్షణ ఉంటుందని శనివారం ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. 'క్రియేట్ యువర్ ఓన్ యూట్యూబ్ ఛానెల్, ప్రమోషన్ ఆఫ్ వీడియో అండ్ స్లైడ్ షో క్రియేషన్, సోషల్ మీడియా మార్కెటింగ్ కనెక్టింగ్ సోషల్ మీడియా, హౌ టు ఇంక్రీజ్ ది కన్స్యూమర్ నెట్‌వర్క్, ఎఫెక్టివ్ మార్కెటింగ్ అండ్ ప్రమోషన్ - ఆన్‌లైన్ మార్కెటింగ్ - డొమైన్ నేమ్, హోస్టింగ్ - వెబ్‌సైట్ డిజైన్ టెక్నిక్, సైబర్ క్రైమ్ పాలసీ, రూల్స్' అనే అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొంది. మరిన్ని వివరాలకు www.editn.in వెబ్‌సైట్ లేదా సోమవారం నుంచి శుక్రవారం వరకు 86681 00181, 98413 36033 ఫోన్ నెంబర్లపై పని వేళల్లో సంప్రదించవచ్చన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఈడీఐఐ, సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఈడీఐఐ ఆఫీస్ రోడ్డు, గిండీ, చెన్నై - 600 032 చిరునామాలో శిక్షణ ఉంటుంది.

మెరీనా ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు నేడు

☛ ఐఏఎఫ్ 'ఎయిర్ షో' సందర్భంగా మార్పులు ☛ వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు

వడపళని, న్యూస్‌టుడే: భారత వైమానిక దళం (ఐఏఎఫ్) వాయు విన్యాసాల ప్రదర్శన కారణంగా ఆదివారం మెరీనా తీరంలో ట్రాఫిక్‌లో మార్పులు చేసినట్లు ట్రాఫిక్ విభాగం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. 6,500 మంది పోలీసులు, 1,500 మంది హోంగార్డులు భద్రతా విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

■ కామరాజర్ సాలైలో..

గాంధీ విగ్రహం, వార్ మెమోరియల్ సాలైకి వెళ్లడానికి పాస్‌లున్న వారిని మాత్రమే అనుమతిస్తారు. పాస్‌లు లేని వాహన చోదకులు రాధాకృష్ణన్ సాలైలోకి రాకుండా వాలాజాసాలైలో వాహనాలు నిలుపుకోవాలి. ◗ తిరువాన్మియూరు నుంచి కామరాజర్ సాలై మీదుగా ప్యారీస్ కార్నర్‌కు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. సర్దార్ పటేల్ రోడ్డు, గాంధీ మండపం రోడ్డు, అన్నాసాలై మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ◗ ప్యారీస్ కార్నర్ నుంచి తిరువాన్మియూరు వెళ్లాల్సిన వాహనాలు అన్నాసాలై, తేనాంపేట, గాంధీ మండపం మీదుగా దారి మళ్లించారు. కామరాజర్ సాలైలోకి అనుమతి లేదు.

■ ఎంటీసీ బస్సులు

అన్నా విగ్రహం నుంచి వచ్చే బస్సులు వాలాజా రోడ్డు, ట్రిప్లికేన్ హైరోడ్డు, రత్న కేఫ్ కూడలి, ఐస్ హౌజ్ కూడలి, డాక్టర్ నటేశన్ రోడ్డు, రాధాకృష్ణన్ సాలై మీదుగా వెళ్లాలి. ◗ గ్రీన్‌వేస్ పాయింట్ నుంచి వచ్చే బస్సులు మందవెల్లి, ఆర్‌ఏపురం 2వ మెయిన్ రోడ్డు, టీటీకే సాలై, అన్నాసాలై మీదుగా దారి మళ్లించారు.

■ వాణిజ్య వాహనాలు

ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కామరాజర్ సాలై, అన్నా సాలై, శాంథోం హైరోడ్డు, ఆర్కే సాలై, కెథడ్రల్ రోడ్డు, వాలాజా రోడ్డులతో పాటు ఇతర ముఖ్యమైన రోడ్లలోకి వాణిజ్య వాహనాలకు అనుమతి లేదు. ◗ వీఐపీ, వీవీఐపీ వాహనాలు ఫోర్‌షోర్ ఎస్టేట్ రోడ్డులో, బ్లూ పాస్ (నీలి రంగు పాస్) ఉన్న వాహన చోదకులు ప్రెసిడెన్సీ కళాశాలలో, స్వామి శివానంద సాలై, లేడి వెల్లింగ్డన్ కాలేజీలో పార్క్ చేసుకోవచ్చు.

■ శాంథోం రోడ్డు

డెఫ్ అండ్ డంబ్ సీఎస్ఐ స్కూలు, సెయింట్ బేడీస్ హయ్యర్ సెకండరీ స్కూలు, సెయింట్ థామస్ స్కూలు, సెయింట్ బేడీస్ గ్రౌండు, కెథడ్రల్ ప్రైమరీ స్కూలు, కమ్యూనిటీ హాలు, శాంథోం లూప్ రోడ్డు (ఒక వైపు పార్కింగు)లో పార్క్ చేసుకోవాలి.

■ రాధాకృష్ణన్ సాలై

ఎమ్మార్టీఎస్ లైట్ హౌజ్ రోడ్డు, ఎన్‌కేటీ స్కూలు (ఐస్ హౌజ్ కూడలి), క్వీన్ మేరీస్ కాలేజ్ (ప్రెస్, పోలీసు వాహనాలు మాత్రమే), సెయింట్ ఎబ్బాస్ స్కూలులో పార్క్ చేసుకోవచ్చు.

■ వాలాజా రోడ్డు

కలైవానర్ అరంగం, ఓమందూరార్ మెడికల్ గ్రౌండు (ప్రెస్ క్లబ్బు ద్వారా లోపలికి రావాలి), విక్టోరియా హాస్టల్ గ్రౌండు.

■ అన్నా సాలై

ఐలండ్ గ్రౌండు, పీడబ్ల్యూడీ గ్రౌండు (సెక్రటరియేట్ ఎదురుగా) మన్రో విగ్రహం నుంచి పల్లవన్ సాలై కూడలి, చింతాద్రిపేట ఎమ్మార్టీఎస్. ◗ వాహనాల పార్కింగు ఉదయం 9.30 గంటలకల్లా ముగుస్తుంది. వాహన చోదకులంతా ముందుగానే తమ వాహనాలను పార్క్ చేసుకోవాలి.

■ అదనపు బస్సులు

ప్రజలు భారీ సంఖ్యలో తరలిరానుండటంతో ఎంటీసీ, మెట్రో రైళ్లు, ఎమ్మార్టీఎస్ సేవలందుబాటులో ఉంటాయి, ఎంటీసీ అదనంగా 75 బస్సులను అన్నా స్క్వేర్ వరకు నడుపుతోంది. మినీ బస్సులు గవర్నమెంట్ ఎస్టేట్, డీఎంఎస్ మెట్రో స్టేషను నుంచి మూడు నిమిషాల వ్యవధిలో మద్రాసు వర్సిటీ, రెండు నిమిషాలకొకటి చొప్పున వీఎం ఇల్లం రోడ్డు - ఆర్కే సాలై కూడలి వరకు నడుస్తాయి.

శోభాయమానంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



శూలిని అలంకరణలో కన్యకా పరమేశ్వరి

ప్యారిస్, న్యూస్‌టుడే: జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో గురువారం నుంచి జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. పండితుల చతుర్వేద పారాయణాలు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మూలమంత్ర హోమంతో మూడోరోజు శనివారం వేడుకలు ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, ఆరాధనలు నిర్వహించారు. సాయంత్రం మూలవిరాట్టును బంగారు ఆభరణాలతో, ఉత్సవమూర్తిని భూత వాహనంపై శూలినిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆరాధ్య నాట్యాలయ విద్యార్థుల నాట్య ప్రదర్శన, తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ సభ్యుల, లలితా మహోత్సవ బృందం భక్తి గేయాలాపన, డివైన్ స్ట్రింగ్స్ వీణ పాఠశాల విద్యార్థుల వీణానాదం, శ్రీ విజయనాథన్ గాత్ర కచేరీ భక్తులను రంజింపజేశాయి. శనివారం ఉత్సవదాతగా శ్రీ కాశిశెట్టి దాలిబోర్ ఉదయకుమార్ వ్యవహరించింది. పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆరాధ్య నాట్యాలయ కావడి నృత్యం

మాజీమంత్రి కారుకు ప్రమాదం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నాగపట్టిణం జిల్లా వేదారణ్యం అన్నాడీఎంకే ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఓఎస్ మణియన్ కారు ప్రమాదానికి గురైంది. శనివారం వేదారణ్యం నుంచి కీళవళురు ప్రాంతానికి వెళుతుండగా ఈస్ట్ బీచ్‌రోడ్డులో ద్విచక్రవాహనానం హఠాత్తుగా రావడంతో డ్రైవర్ కారును పక్కకు తిప్పడంతో అదుపుతప్పి పెరియాచ్చి అమ్మవారి ఆలయ గోడను ఢీకొట్టింది. ముందుసీట్లో కూర్చుని ఉన్న ఓఎస్ మణియన్, డ్రైవర్ అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని నాగపట్టిణం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు ముందు భాగం దెబ్బతింది.

'ప్రజలను మోసం చేస్తున్న ద్రావిడ పార్టీలు'

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ద్రావిడ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని భాజపా సమన్వయ కమిటీ అధ్యక్షుడు హెచ్.రాజా విమర్శించారు. చెన్నై కమలాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పేదలకు పథకాలు అందించే ఏకైక నాయకుడు ప్రధాని మోదీ మాత్రమే అన్నారు. కరోనా కాలం నుంచి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 80 కోట్ల మందికి నెలకు ఒక్కొక్కరికి 5 కిలోల బియ్యం, కిలో పప్పు ఉచితంగా అందిస్తోందని గుర్తు చేశారు. కుటుంబంలో నలుగురు ఉంటే 20 కిలోల బియ్యం, 4 కిలోల పప్పు ఇస్తోందన్నారు. డీఎంకే ఒక్కొక్క ఇంటికి రూ.1000 మాత్రమే అందిస్తోందన్నారు. కేంద్రం 70 ఏళ్లకు పైబడిన వారందరికీ రూ.5లక్షల వైద్య బీమా పథకం ప్రవేశపెట్టిందని చెప్పారు.



మాట్లాడుతున్న హెచ్.రాజా



సమావేశంలో మంత్రులు తంగం తెన్నరసు, రామచంద్రన్, ఎంపీ దయానిధి మారన్ తదితరులు

నూతన విద్యా విధానాన్ని అనుమతించబోము

ఎంపీ దయానిధి మారన్

ప్యారిస్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని బలవంతంగా రుద్దడానికి యత్నిస్తోందని ఎంపీ దయానిధి మారన్ ఆరోపించారు. విరుదునగర్‌లో డీఎంకే క్రీడాభివృద్ధి విభాగం తరఫున ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శనివారం జరిగిన సమావేశంలో మంత్రులు సాత్తూర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, ఎంపీ దయానిధి మారన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయానిధి మారన్ మాట్లాడుతూ... మహిళా విద్యను ప్రోత్సహించడంతో పాటు ఆర్ట్స్, సైన్సు, ఇంజినీరింగ్, వైద్య కళాశాలలను అత్యధికంగా డీఎంకే ప్రభుత్వం తమిళనాడుకి తీసుకొచ్చిందని తెలిపారు. కానీ ప్రస్తుతం నూతన విద్యా విధానాన్ని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆ ప్రకారం ఐదో తరగతిలో పబ్లిక్ పరీక్షలు జరిపి ఉత్తీర్ణత సాధించకపోతే చదువు రాలేదని పక్కన పెడతారన్నారు. పాఠశాల విద్యను విద్యార్థులు మధ్యలో ఆపకూడదని రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకం ప్రవేశపెట్టి విద్యా సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వ సాయం ప్రకటన

చెన్నై, న్యూస్‌టుడే: మణలి, ఎన్నూర్ ఎక్స్‌ప్రెస్ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎన్నూర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ లక్ష్మణన్(37)కు ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షలను సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని ఆదేశించారు.

సెంథిల్ బాలాజీ కేసులో క్రాస్ ఎగ్జామినేషన్

ప్యారిస్: మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో సెషన్స్ కోర్టులో క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన మంత్రి ప్రస్తుతం బెయిల్‌పై బయటికొచ్చారు. చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో న్యాయమూర్తి కార్తికేయన్ విచారిస్తున్నారు. శుక్రవారం విచారణ సమయంలో సెంథిల్ బాలాజీ హాజరయ్యారు. ఈడీ తరఫున సాక్షి అయిన ఫోరెన్సిక్ విభాగం అసిస్టెంట్ డైరక్టరు మణివణ్ణన్ హాజరయ్యారు. మంత్రి తరపు లాయర్ ఇళంగో కేసు విచారణ వాయిదా వేయాలని కోరారు. అందుకు ఈడీ తరపున అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ తరపున సాక్షి ప్రస్తుతం హాజరయ్యారని, విచారణ జరపాలని న్యాయమూర్తి తెలిపారు. మణివణ్ణన్ వద్ద సెంథిల్ బాలాజీ తరపు లాయరు క్రాస్ ఎగ్జామినేషన్ జరిపారు. పూర్తి కాకపోవడంతో తదుపరి విచారణ 29కి వాయిదా వేశారు.



విద్యుత్తు బోర్డు ప్రధాన కార్యాలయంలో 24 గంటలు పనిచేసే వినియోగదారుల సేవాకేంద్రం మిన్నగంలో శనివారం పరిశీలిస్తున్న మంత్రి సెంథిల్ బాలాజీ. వెంట టాన్‌జెడ్కో ఛైర్మన్, ఎండీ నందకుమార్ ఉన్నారు. - ప్యారిస్, న్యూస్‌టుడే



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

తిరుత్తణి ఆలయ హుండీ కానుకల లెక్కింపు

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ హుండీ కానుకలు లెక్కించారు. 30 రోజులకుగాను రూ.1.25 కోట్ల నగదు, 635 గ్రాముల బంగారం, 9 కిలోల వెండి అందినట్లు ఆలయ యంత్రాంగం శనివారం ప్రకటనలో తెలిపింది.



విలేకరులతో మాట్లాడుతున్న అన్బళగన్

ప్రభుత్వాస్పత్రిలో పడకలు పెంచాలి

ఆర్కేనగర్: పుదుచ్చేరి ప్రభుత్వ ఆస్పత్రిలో అదనంగా పడకలు ఏర్పాటు చేయాలని అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర చికిత్సా విభాగంలో ఒకే పడకపై ముగ్గురు పడుకొనే పరిస్థితి ఉందన్నారు. దీంతో అనేకమంది రోగులు నేలపై పడుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం డెంగీ వ్యాప్తి అధికమవుతోందని, రోగులను ఒకేచోట పడుకోబెట్టడం మంచిది కాదన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈ విషయంలో జోక్యం చేసుకొని అదనంగా పడకలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతన బకాయిలను వెంటనే అందజేయాలన్నారు.

'ఇండిగో ఎయిర్‌లైన్స్'కు సాంకేతిక సమస్య

వడపళని, న్యూస్‌టుడే: 'ఇండిగో ఎయిర్‌లైన్స్' సంస్థ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యల కారణంగా శనివారం 20 విమానాల సేవలకు అంతరాయం కలిగింది. ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లు అందించడంలో జాప్యం ఏర్పడింది. చేతితో రాసినవి అందించారు. చెన్నై నుంచి దిల్లీ, బెంగళూరు, అహ్మదాబాదు, తూత్తుకుడి, హుబ్బళి, శిర్డీ, ముంబై, పుణె, గోవా, తిరుచ్చి, కోయంబత్తూరు, మదురై, సింగపూర్ వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇతర విమాన సంస్థలకు సమస్యల్లేవని అధికారులన్నారు.

ముగిసిన తెలుగు తరగతులు

ప్రశంసాపత్రాల అందజేత

టీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత తెలుగు తరగతులు పూర్తయిన సందర్భంగా ప్రశంసాపత్రాల అందజేత కార్యక్రమం శనివారం చెన్నై నగరంలో జీఎన్ శెట్టి రోడ్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. జూన్‌లో ప్రారంభమైన తెలుగు తరగతులు నాలుగు నెలల పాటు జరిగాయి. సుమారు 65 మంది పాల్గొన్నారు. వారికి శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి పి.రామ్మోహన్‌రావు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. తమిళనాడులో తెలుగువారు దాదాపు 40 శాతం మంది ఉన్నా తెలుగు భాష నేర్చుకున్న వారి సంఖ్య చాలా తక్కువగానే ఉందన్నారు. తమిళ రాష్ట్రంలో ఉంటున్న కారణంగా అనేకమంది తెలుగు భాష నేర్చుకోవడంలో విఫలమయ్యారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షులు వీఎల్ ఇందిరాదత్ చొరవ తీసుకుని తెలుగు భాష నేర్పడం హర్షణీయమన్నారు. తెలుగు భాషాభివృద్ధి కోసం తానూ తన వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. సమాఖ్య ఉపాధ్యక్షులు కవితాదత్ మాట్లాడుతూ.. తెలుగు భాష నేర్చుకోవాలనుకునే తమిళనాడులోని తెలుగువారంతా తాము నిర్వహించే ఉచిత తరగతులకు హాజరై లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మీ మోహన్‌రావు మాట్లాడుతూ.. సంగీత కళాకారులు కీర్తనలు నేర్చుకోవాలన్న కారణంగా తెలుగు తరగతులకు హాజరవుతున్నారని, ఉద్యోగరీత్యా తెలుగు రాష్ట్రాలకు వెళ్లే తెలుగేతర భాషల వారు కూడా ఇందులో పాల్గొంటున్నట్లు తెలిపారు. గత 30 ఏళ్లలో ఏడు వేల మందికి పైగా తరగతులకు హాజరై లబ్ధి పొందారన్నారు. ఉచితంగా పుస్తకాలు అందించామన్నారు. తదుపరి సెషన్ నవంబరు 2వ తేదీ ప్రారంభం కానుందన్నారు. ఆసక్తి ఉన్న వారు తమను 044 28152191, 044 48640602 ఫోన్ నెంబర్లపై సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా తరగతులు బోధించిన డా. ఏవీ శివకుమారి, టీనగర్ కేసరి మహోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మోహన్, మాణిక్యమ్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



రామ్మోహన్‌రావుతో నిర్వాహకులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

సామ్‌సంగ్ కార్మికులతో మంత్రుల చర్చలు రేపు

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: శ్రీపెరుంబుదూర్ వద్ద ఉన్న సామ్‌సంగ్ ఇండియా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తయారీ ప్లాంట్‌లో పనిచేస్తున్న 90 శాతం మంది కార్మికులు వేతనాలు పెంచాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని తదితర డిమాండ్లతో నిరవధిక సమ్మెకు దిగారు. కార్మికులు తప్పనిసరిగా విధుల్లో చేరాలని, అలా కాకుంటే వేతనంలో కోత విధించడం లేదా ఉద్యోగం నుంచి తొలగించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుందని యాజమాన్యం హెచ్చరించింది. ఈ క్రమంలో కార్మికులకు సత్వర పరిష్కారం చూపాలని సీఎం స్టాలిన్ యాజమాన్యానికి సూచించారు. ఇప్పటికే అనేక దశల్లో అధికారులు జరిపిన చర్చలతో ఎలాంటి ఫలితం లేకపోవడంతో మంత్రులు టీఆర్బీ రాజా, టీఎం అన్బరసన్, గణేశన్ సీఎం ఆదేశాల మేరకు సోమవారం కార్మికులతో చర్చలు జరపనున్నారు.

విశ్వకర్మ పథకం అమలు చేయాలి : వానతి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం దురుద్దేశంతో విశ్వకర్మ పథకాన్ని అమలు చేయలేదని కోవై సౌత్ భాజపా ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ ఆరోపించారు. ఆమె కోవైలో శనివారం జరిగిన ఓ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. కుల వృత్తులను ప్రోత్సహించాలనే ఉన్నత ఆశయంతో కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు పథకాన్ని అమలు చేశాయని, స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే సర్కార్ మొండి వైఖరి అవలంబిస్తుండటం బాధాకరమన్నారు. పథకం అమలుకు లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వంపై తిరగబడాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తోంది

వేళచ్చేరి, న్యూస్‌టుడే: మద్యపానం నిషేధం మహానాడులో వీసీకే తిరుమావళవన్ వ్యాఖ్యలు ఆయన వక్రబుద్ధికి నిదర్శనమని భాజపా సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్ మండిపడ్డారు. శనివారం చెన్నై కమలాలయంలో విలేకరులతో మాట్లాడారు. చెన్నై మెట్రో రైలు రెండోదశ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపునకు కేంద్ర మంత్రివర్గం తెలిపిన నేపథ్యంలో ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. తమిళనాడు అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందన్నారు. ఇటీవల ఉళుందూర్‌పేటలో నిర్వహించిన మహానాడులో వీసీకే అధ్యక్షుడు మహాత్మా గాంధీని కించపరిచేలా మాట్లాడారని ధ్వజమెత్తారు.



విలేకరుల సమావేశంలో తమిళిసై సౌందరరాజన్ తదితరులు

పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: దసరా పర్వదినం సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ రైల్వే శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

● **06171** కోయంబత్తూరులో 6న 23.30కి బయలుదేరి మరుసటి రోజు 08.30కి ఎగ్మూరు వస్తుంది. ● **06172** ఎగ్మూరులో 7న 10.30కు బయలుదేరి అదే రోజు 18.00కు పొదనూరు చేరుతుంది. ● **06178** చెన్నై సెంట్రల్‌లో 9న 19.00కు బయలుదేరి మరుసటి రోజు 10.50కి నాగర్‌కోయిల్ వెళ్తుంది. ● **06179** నాగర్‌కోయిల్‌లో 10న 19.30కి బయలుదేరి మరుసటి రోజు 11.25కు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ● **06186** చెన్నై సెంట్రల్‌లో 8న 23.45కు బయలుదేరి మరుసటి రోజు 13.50కు ట్యుటికోరిన్ వెళ్తుంది. ● **06187** ట్యుటికోరిన్‌లో 9న 16.15కు బయలుదేరి మరుసటి రోజు 08.55కి చెన్నై సెంట్రల్‌కు వస్తుంది. ● **06190** తిరుచ్చిరాపల్లిలో ఈ నెల 11 నుంచి 31 డిసెంబరు వరకు (మంగళ, బుధ, శుక్ర, శని, ఆది) 05.35కు బయలుదేరి అదే రోజు 12.30 గంటలకు తాంబరానికి వస్తుంది. ● **06191** తాంబరంలో 11 నుంచి డిసెంబరు 31 వరకు (మంగళ, బుధ, శుక్ర, శని, ఆది) 15.30కు బయలుదేరి అదే రోజు 23.55కి తిరుచ్చిరాపల్లి చేరుతుంది. రిజర్వేషన్లు కూడా ప్రారంభమయ్యాయి.

తప్పుల తడకగా తమిళ పదాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ జిల్లా కుళిత్తలై యూనియన్‌లో కొత్తగా ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రంలో రాసిన తమిళ పదాలు భాషను అవహేళన చేసే విధంగా ఉన్నాయి. కేంద్రంలో చిన్నారులకు నేర్పించడానికి చిత్రీకరించిన జాతీయ జెండా, జాతీయ నేతలు, పండ్లు, కూరగాయల పేర్లు తప్పుగా రాశారు. గొయ్యాపళం (జామ)కు బదులు గోయ్యాపళం అని, వెండైక్కాయి (బెండకాయ)కి బదులు వెట్టైక్కాయ్ అని, వాళైపళం (అరటిపండు)కు బదులుగా వాలైపలం అని, దర్భూసని (పుచ్చకాయ)కి బదులు దర్బుసని అని రాసి ఉంది. దీన్ని చూసిన స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వారు నివ్వెరపోయారు. పదాలను సక్రమంగా రాయించాలని ఎమ్మెల్యే ఉపాధ్యాయులను ఆదేశించారు.



అంగన్‌వాడీ కేంద్రంలో తప్పుగా రాసిన పదాలు

'వరుమున్ కాప్పోం' శిబిరం

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా నెమలి పంచాయతీ యూనియన్‌లోని కిలాన్‌దూరై గ్రామంలో 'కలైజ్ఞర్ వరుమున్ కాప్పోం' వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు వడివేలు ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. 500 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలను, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.



పౌష్టికాహార కిట్లు అందుకున్న గర్భిణులతో వడివేలు



గానం చేస్తున్న కృష్ణమణి

వీనులవిందుగా కృష్ణమణి గాత్ర కచేరి

ప్యారిస్, న్యూస్‌టుడే: వర్ధమాన గాయని జయమంగళ కృష్ణమణి గాత్ర కచేరి వీనులవిందుగా సాగింది. ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ వాగ్గేయకారులు పాపనాశం శివన్, శ్యామాశాస్త్రి, అన్నమాచార్యుల సంస్మరణ దినోత్సవం ఆళ్వారుపేటలోని యతిరాజ కల్యాణ నిలయంలో శనివారం జరిగింది. కార్యక్రమంలో చివరిగా నిర్వహించిన జయమంగళ కృష్ణమణి గాత్ర కచేరిలో గాయని అన్నమాచార్య కీర్తనలను అలవోకగా గానం చేసి వాగ్గేయకారునికి సంగీతాంజలి అర్పించారు. వయోలిన్‌పై ముంబయి ఆర్ మాధవన్, మృదంగంపై మేధా కావేరి బాలాజీ అందించిన వాద్య సహకారం కచేరికి మరింత వన్నెతెచ్చింది.



చిత్రంలోని ఓ సన్నివేశం

రాకెట్ డ్రైవర్ ట్రైలర్ విడుదల

చెన్నై, న్యూస్‌టుడే: శ్రీరామ్ ఆనందశంకర్ దర్శకత్వంలో నాగ విశాల్, వర్ధమాన నటి విశ్వత్ జంటగా నటిస్తున్న చిత్రం 'రాకెట్ డ్రైవర్'. కాత్తాడి రామమూర్తి, సునైన, జగన్ తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను తన రోల్ మోడల్‌గా కలిగిన ఆటో డ్రైవర్ జీవితంలో ఏర్పడిన కీలక మలుపు, ఇతర పరిణామాలను హాస్య, వినోదాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. స్టోరీస్ బై ది షోర్ పతాకంపై ఈ చిత్రాన్ని వల్లభ్ నిర్మిస్తున్నారు. ఫస్ట్‌లుక్ పోస్టరు ఇప్పటికే విడుదలైన నేపథ్యంలో ట్రైలరును నటుడు సిలంబరసన్ తన 'ఎక్స్' పేజీలో విడుదల చేశారు. చిత్రానికి కౌశిక్ క్రిష్ సంగీతం సమకూర్చుతున్నారు.

ఆలన్ ఆడియో, ట్రైలర్...

చెన్నై: 3ఎస్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత ఆర్.శివ కథ రాసి దర్శకత్వం, నిర్మాణ బాధ్యతలు చేపడుతున్న చిత్రం 'ఆలన్'. వెట్రి, మధుర, అను సితార, కరుణాకరన్, వివేక్ ప్రసన్న, 'అరువి' మదన్‌కుమార్ తదితరులు నటించారు. చిత్రానికి వర్ధమాన సంగీత దర్శకుడు మనోజ్ కృష్ణ సంగీతం సమకూర్చుతున్నారు. క్రియేటివ్ ఎంటర్‌టైనర్స్, డిస్ట్రిబ్యూటర్స్ పతాకంపై నిర్మాత ధనుంజయన్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్రం ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చిత్రబృందం నిర్వహించింది. వాటిని దర్శకనటుడు కె.భాగ్యరాజ్ ఆవిష్కరించగా నిర్మాత శివ స్వీకరించారు.



ఆడియో ఆవిష్కరిస్తున్న భాగ్యరాజ్

అమరన్ తొలి సింగిల్...

చెన్నై: రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్'. రానున్న 31న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్రం తొలి సింగిల్ 'హే మిన్నలే'ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. ఇది సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్‌కు 700వ పాట కావడం గమనార్హం. ఈ పాటను కార్తిక్ నేతా రాయగా శ్వేతా మోహన్, హరిచరణ్ సంయుక్తంగా పాడారు.



చిత్రబృందం విడుదల చేసిన పోస్టరు

పుదువై కొత్త బస్ టెర్మినల్ త్వరలో ప్రారంభం



నిర్మాణంలో ఉన్న టెర్మినల్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి మరైమలై అడిగళ్ రోడ్డులో నిర్మిస్తున్న కొత్త బస్ టెర్మినల్ ఈనెలలో అందుబాటులోకి రానుంది. ఇక్కడి శిథిలావస్థకు చేరిన బస్టాండ్‌ను కూల్చి స్మార్ట్‌సిటీ పథకం కింద రూ.29 కోట్ల వ్యయంతో వాణిజ్య ప్రాంగణంతో కూడిన కొత్త బస్ టెర్మినల్ నిర్మాణం 2023 జూన్‌లో ప్రారంభించారు. ముఖ్యమంత్రి రంగసామి శంకుస్థాపన చేశారు. తర్వాత ఎన్నికలు రావడంతో పనులకు జాప్యం ఏర్పడింది. ఎన్నికలు ముగిసిన తర్వాత పనులు వేగవంతం చేశారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్ వర్షానికి బురదమయంగా మారడంతోపాటు అత్యవసర సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో బస్ టెర్మినల్ పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నగరం మధ్యలో వాణిజ్య ప్రాంగణంతో నిర్మిస్తున్నారు. ఈ భవనంలోనే టికెట్ బుకింగ్ కార్యాలయం, రవాణా సంస్థ, విచారణ కార్యాలయం, సీసీ కెమెరా పర్యవేక్షణ గది, బాలింతలు పాలిచ్చేందుకు ప్రత్యేక గది, మూడు వెయిటింగ్ హాళ్లు, ఏటీఎం కేంద్రం, తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్, మరుగుదొడ్లు, 31 దుకాణాలు, హోటళ్లు నిర్మించారు. ఆటోలు, ట్యాక్సీలు, టెంపోలు నిలిపేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించారు.

15 నుంచి చిత్రీకరణకు రజినీకాంత్



విలేకర్లతో మాట్లాడుతున్న లోకేశ్ కనకరాజ్

చెన్నై: రానున్న 15వ తేదీ నుంచి రజనీకాంత్ చిత్రీకరణ పనుల్లో పాల్గొననున్నారని దర్శకుడు లోకేశ్ కనకరాజ్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... తనకు ఓ చిన్నపాటి చికిత్స చేయాల్సి ఉందని 40 రోజుల కిందటే రజనీకాంత్ తనతో చెప్పారన్నారు. ఆయన గురించి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు తమను ఆశ్చర్యానికి గురి చేశాయని, మానసిక బాధను కలిగించాయని తెలిపారు. రజనీకాంత్ ఆరోగ్యాన్ని దగ్గర నుంచి చూసినట్టు పలువురు మాట్లాడుతున్నారని, దీనిపై ఎలా స్పందించాలో అర్థం కావడంలేదని పేర్కొన్నారు. రానున్న 15 నుంచి రజనీకాంత్ చిత్రీకరణ పనుల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ఎస్ఎంఎస్ రెండో భాగానికి సన్నాహాలు

చెన్నై: రాజేశ్ దర్శకత్వంలో జీవ, సంతానం ప్రధాన పాత్రల్లో నటించి 2009లో విడుదలైన విజయవంతమైన చిత్రం 'శివ మనసుల శక్తి' (ఎస్ఎంఎస్). జీవ, సంతానం కాంబినేషన్‌లోని కామెడీ ట్రాక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి రెండో భాగాన్ని తెరకెక్కించనున్నట్టు దర్శకుడు రాజేశ్ ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. స్క్రిప్టును సిద్ధం చేస్తున్నట్టు, నటుడు జీవాతో దీని గురించి చర్చించినట్టు వెల్లడించారు.

తమిళ సినిమా

జయం రవి తదుపరి చిత్రంపై ప్రకటన

చెన్నై: జయం రవి ప్రస్తుతం 'బ్రదర్', 'జీనీ', 'కాదలిక్క నేరమిల్లై' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన 34వ చిత్రం గురించి ప్రకటన వెలువడింది. 'దాదా' చిత్ర దర్శకుడు గణేశ్ కె.బాబు దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రానికి తాత్కాలికంగా 'జేఆర్ 34' టైటిల్ పెట్టారు. సంబంధిత పోస్టరును చిత్రబృందం విడుదల చేసింది. స్క్రీన్ సీన్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ పతాకంపై జయం రవికి ఇది మూడో చిత్రం కావడం గమనార్హం.



హొగినేకల్‌కు పెరిగిన నీటిరాక

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కావేరి పరివాహక ప్రాంతాలైన అంజెట్టి, కేరట్టి, నాట్రాంపల్లి, పిలిగుండ్లు, హొగినేకల్ అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ధర్మపురి జిల్లా హొగినేకల్ జలపాతానికి శుక్రవారం సాయంత్రం 8 వేల ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. శనివారం ఉదయం 10 వేల ఘనపుటడుగులకు పెరిగింది. మెయిన్ జలపాతం, సినీ ఫాల్స్, ఐవర్‌పాణి జలపాతాలలో నీరు ఉద్ధృతంగా ఉంది. పర్యాటకులు ఉత్సాహంగా జలపాతాలలో స్నానాలు చేసి దోనెల షికారు చేస్తున్నారు.

సహకార దుకాణాల్లో టమాటా, ఉల్లి విక్రయించాలి



విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కిలో టమాటా, పెద్ద ఉల్లి కిలో రూ.90కి విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యులు కొనలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో సహకార కూరగాయల దుకాణాల్లో తక్కువ ధరకు టమాటా విక్రయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం వరకు కిలో రూ.40 పలికిన టమాటా ఉన్నట్టుండి రూ.80కి చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం జాతీయ సహకార సంస్థ తరఫున సంచార వాహనాల ద్వారా జనరద్దీ ప్రాంతాల్లో కిలో ఉల్లి రూ.35కి విక్రయిస్తోంది. అదేవిధంగా రాష్ట్ర సహకార కూరగాయల దుకాణాల్లోనూ ఉల్లి, టమాటా రాయితీపై విక్రయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజరాజేశ్వరిగా పరాశక్తి అనుగ్రహం



రాజరాజేశ్వరి అలంకరణలో పరాశక్తి అమ్మవారు ◆ శ్రీనివాసుడి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పరాశక్తి అమ్మవారిని ఊరేగింపుగా ఆస్థాన మండపం నుంచి కల్యాణ ఉత్సవ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు జరిగాయి. శనివారం సాయంత్రం అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

వేంకటేశ్వరుడిగా కన్యకా పరమేశ్వరి

పళ్లిపట్టు: పళ్లిపట్టు బజారువీధిలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. సాయంత్రం వేంకటేశ్వరస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా పట్టణ దేవత శ్రీకొల్లాపురమ్మ ఆలయంలో అమ్మవారికి వేంకటేశ్వరస్వామి అలంకరణ చేశారు.

కనులపండువగా వరదనారాయణుడి ఊరేగింపు

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు బ్రాహ్మణ వీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత వరదనారాయణ పెరుమాళ్ ఆలయంలో పెరటాసి మాస 3వ శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను అలంకరించి రథంపై కొలువుదీర్చి ఊరేగించారు.



శ్రీదేవి, భూదేవి సమేత వరదనారాయణుడు

పలు జిల్లాల్లో భారీ వర్షాలు



విల్లివాక్కం: ఈరోడ్‌లో రోడ్డుపై నిలిచిన వాననీరు

విల్లివాక్కం: ఈరోడ్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఈరోడ్‌లోని బస్టాండ్, నాచ్చియప్ప రోడ్డు, ఆర్కేవి రోడ్డు, శక్తి రోడ్డు, గాంధీజీ రోడ్డు తదితర ప్రాంతాలు జలమయం అయ్యాయి. చాకర కుంటలో నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో చక్కెర వాగు మీదుగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కూరగాయల లోడుతో వెళ్తున్న వాహనం వరదనీటిలో చిక్కుకుంది. తాడుకట్టి బయటకు తీసుకొచ్చారు. ఈరోడ్ నగరంలో 49 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఊత్తుకోట: ఊత్తుకోటలో గత 20 రోజులుగా వేసవి తలపించేలా ఎండలు మండిపోయాయి. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలైన అన్నానగర్, ఏవీఎం కాలనీ, కుమారి థియేటర్ కాలనీ, అంబేడ్కర్‌నగర్, గొయ్యతోప్పులో మోకాళ్ల లోతు నీరు నిలవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆర్కేనగర్: పుదుకోట్టై జిల్లాలో రెండ్రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి అత్యధికంగా ఆవుడయార్‌కోవిల్ ప్రాంతంలో 120 మి.మీ వర్షపాతం నమోదైంది. పుదుకోట్టైలో రాత్రి కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అన్నవాసల్‌లో 47, గంధర్వకోట్టైలో 46, పొన్నమరావతి 40, అరంతాంగిలో 40 మి.మీ వర్షపాతం నమోదైంది.



విలేకరులతో మాట్లాడుతున్న మంగళ్‌పాండే

సీఎంసీ సందర్శించిన బిహార్ మంత్రి

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా ఆర్కాడు సమీప పూటుతాకు వద్ద ఉన్న సీఎంసీ ఆసుపత్రిని శనివారం బిహార్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి మంగళ్‌పాండే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన, సీఎంసీ డైరెక్టరు విక్రమ్ మాథ్యూ సంయుక్తంగా విలేకరులతో మాట్లాడుతూ.. సీఎంసీ సహకారంతో తలసేమియా రోగులకు బిహార్ ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందజేయనుందని తెలిపారు.



అధికారులతో వాగ్వాదానికి దిగిన దుకాణ యజమానులు

ఆక్రమణల తొలగింపు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ నగరంలో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. దీంతో రోడ్ల వెంబడి ఆక్రమణలు తొలగించే పనులలో కార్పొరేషన్ అధికారులు నిమగ్నమయ్యారు. ఇటీవల మొదటి విడతగా ఆక్రమణలు తొలగించగా ఆయుధపూజ, దీపావళి పండుగలు త్వరలో ఉన్నందున ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఈ నెల 3వ తేదీ కొన్ని ప్రాంతాలలో ఆక్రమణలు తొలగించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం వరకు పన్నీర్‌సెల్వం పార్కు నుంచి మీనాక్షి సుందరనార్ రోడ్డు మార్గం గుండా ఈరోడ్ ప్రభుత్వ ఆస్పత్రి రౌండ్ ఠాణా వరకు ఆక్రమణలు తొలగించారు. ఆ సమయంలో దుకాణదారులు రహదారుల శాఖాధికారులతో వాగ్వాదానికి దిగారు.

వాహన తనిఖీలు

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా ఎస్పీ తిరుమాళ్ ఆదేశాల మేరకు అరక్కోణం డీఎస్పీ వెంకటేశం నేతృత్వంలో నేరాల నియంత్రణకు శనివారం పోలీసులు అరక్కోణంలోని తిరుత్తణి, కాంచీపురం, శోళింగర్ రహదారుల్లో ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

పట్టణ పంచాయతీ కౌన్సిలర్ల సమావేశం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరుమళిసై పట్టణ పంచాయతీ వార్డు కౌన్సిలర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈవో వెంకటేశన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకే కౌన్సిలర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను పెంచడం దారుణమని విమర్శిస్తూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అధ్యక్షుడు మహదేవన్ వారి తీరును ఖండించారు.

ఊత్తుకోట డీఎస్పీగా శాంతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కృష్ణగిరి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వహించిన జాన్‌విక్టర్ చెన్నైకి బదిలీపై వెళ్లారు.

\- ఊత్తుకోట, న్యూస్‌టుడే





లారీపై తీసుకెళ్తున్న ఇనుప గుండు ◆ రోడ్డుపై పడిన దృశ్యం

ఇనుప గుండుతో రాకపోకలకు అంతరాయం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై సుందరాపురం ఎల్ఐసీ కాలనీలో ప్రైవేటు కర్మాగారం ఉంది. ఇక్కడి నుంచి భారీ ఇనుప గుండుతో పాటు సామగ్రితో ఓ లారీ ఉక్కడానికి శనివారం బయలుదేరింది. ఎల్అండ్‌టీ కాలనీ వద్ద లారీపైన ఉన్న భారీ ఇనుప గుండు రోడ్డుపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మెకానిక్‌లు భారీ క్రేన్ సాయంతో దానిని తొలగించారు.

హోమ్‌గార్డుల నియామకానికి పరీక్షలు

వేలచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా సాయుధ పోలీస్ మైదానంలో శనివారం హోమ్‌గార్డుల నియామకానికి దేహదారుఢ్య పరీక్షలు జరిగాయి. జిల్లా ఎస్పీ రాజారాం పరిశీలించారు. 18 మంది పురుషులతోపాటు ఇద్దరు మహిళలను ఎంపిక చేయనున్నారు. డీఎస్పీ సౌమ్య, హోమ్‌గార్డుల విళుపురం రేంజ్ అసిస్టెంట్ కమాండర్ అంజాద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఛాతి కొలతలు తీసే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ రాజారాం

అన్నప్రసాదంలో జెర్రిపడటం అవాస్తవం : తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: మాధవ నిలయంలోని అన్నప్రసాదంలో తాము తిన్న అన్న ప్రసాదంలో జర్రి కనపడిందని తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన భక్తుడు చేసిన ఆరోపణలు వాస్తవ దూరమని తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. శ్రీవారి దర్శనారం వచ్చే వేలాదిమంది భక్తులకు వడ్డించడానికి పెద్ద మొత్తంలో తితిదే అన్న ప్రసాదాలు తయారు చేస్తోందని, అంతవేడిలో జెర్రి యథాతథంగా ఉండే వీలులేదని, పెరుగన్నం కలపాలన్నా ముందుగా వేడిచేసిన అన్నాన్ని బాగా కలియపెట్టిన తరువాతనే పెరుగు కలుపుతారన్నారు. అటువంటప్పుడు ఏమాత్రం రూపు చెదరకుండా జర్రి ఉండటం అనేది కావాలని చేసిన చర్యగా మాత్రమే భావించాల్సి ఉంటుందని, భక్తులు ఇటువంటి సత్యదూర వార్తలను నమ్మకూడదని తితిదే విజ్ఞప్తి చేసింది.

నేడు శోభారాజు సంగీత కచేరి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం సాయంత్రం స్థానిక ఆస్థాన మండపంలో పద్మశ్రీ శోభారాజు సంగీత కచేరి జరుగనుంది. సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకు జరుగనున్న కచేరీలో తమ శిష్యులైన యువగాయనీ గాయకులతో కలిసి వివిధ అన్నమయ్య కీర్తనలను ఆలపించనున్నారు. దాదాపు దశాబ్ద కాలం తరువాత తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఆమె కచేరి చేయనున్నారు.

గొడుగుల ఊరేగింపులో కానుకలివ్వకండి: తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవ రోజు అలంకరించేందుకు చెన్నై నుంచి తిరుమలకు చేరుకునే గొడుగుల ఊరేగింపులో భక్తులు ఎలాంటి కానుకలు అందించరాదని తితిదే విజ్ఞప్తి చేసింది. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో పలు హిందూ సంస్థలు చెన్నై నుంచి గొడుగులను ఊరేగింపుగా తిరుమలకు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించడం ఆనవాయితీ. ఈ గొడుగులు ఈనెల 7న తిరుమలకు చేరుకుంటాయి.

వ్యాను ఢీకొని పంచాయతీ కార్యదర్శి మృతి

గుమ్మిడిపూండి: గుమ్మిడిపూండి సమీప పెరియకుప్పానికి చెందిన శంకర్ (40) నత్తం పంచాయతీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఇతను విధులు ముగించుకుని శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. నత్తం గ్రామ పొలిమేరలో వ్యాను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుమ్మిడిపూండి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు...

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లా కర్నూలు నగరం పార్క్ రోడ్డులోని కర్ణాటక బ్యాంకులో శనివారం ఉదయం జనీష్ (28) అనే యువకుడు విద్యుదాఘాతంలో మృతి చెందారు. కన్నియాకుమరి జిల్లా కవిల్‌వేలైకు చెందిన జనీష్ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే సంస్థలో పనిచేస్తుంటారు. దేశవ్యాప్తంగా కర్ణాటక బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే పనికి ఓ సంస్థకు అప్పగించారు. సదరు సంస్థలో పనిచేస్తున్న జనీష్ శనివారం ఉదయం స్థానిక కర్ణాటక బ్యాంకులో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే పనికి వచ్చారు. బల్ల ఎక్కి తీగ లాగే క్రమంలో విద్యుదాఘాతంతో కిందపడిపోయారు. స్థానికులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదం ఎలా జరిగిందో స్పష్టత రావాల్సి ఉంది. అతని కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా వారు కర్నూలుకు బయలుదేరారు. కర్నూలు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి కూలీ..



మధుసూదనన్ (పాతచిత్రం)

అరక్కోణం: రాణిపేట జిల్లా అరక్కోణం వింటర్‌పేటకు చెందిన మధుసూదనన్ (40) కూలీ. ఇతను శనివారం మేల్‌పాక్కం వద్ద నడిచి వెళ్తుండగా కాలుజారి నేలబావిలో పడ్డాడు. నీటిపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కళాశాల విద్యార్థిని బలవన్మరణం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరుత్తణిలోని చిత్తూరు రోడ్డుకు చెందిన మణికంఠన్ రైతు కూలీ. ఇతని కుమార్తె కలైసెల్వి (18) తిరువళ్లూరులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ఏడాది చదువుతోంది. ఆమె శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బలవన్మరణానికి కారణాలు తెలియలేదు. తిరుత్తణి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కలైసెల్వి (పాతచిత్రం)

తమ్ముడి భార్యపై అత్యాచారయత్నం

పళ్లిపట్టు: పళ్లిపట్టు తాలూకా ఆర్‌కేపేటకు చెందిన శివకుమార్, రాజాత్తి (30) భార్యాభర్తలు. శివకుమార్ పొరుగూరిలో పనిచేస్తుంటాడు. వీరి ఇంటి కింది అంతస్తులో ఇతని అన్న భూపాలన్ (43) నివసిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భూపాలన్ మేడపైకి వెళ్లి ఒంటరిగా ఉన్న రాజాత్తిపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కత్తితో దాడిచేసి పారిపోయాడు. గాయపడిన రాజాత్తిని ఇరుగుపొరుగువారు వేలూరు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆర్‌కేపేట పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న భూపాలన్ కోసం గాలిస్తున్నారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన పువ్వుల వ్యాపారి అరెస్టు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ మరప్పాలం వళ్ళువర్ వీధికి చెందిన పువ్వుల వ్యాపారి అబ్దుల్ రహ్మాన్ (32)కి భార్య, కుమారుడున్నారు. ఈ క్రమంలో రహ్మాన్ 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి గర్భవతిగా తేల్చారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి పోక్సో చట్టం కింద అబ్దుల్ రహ్మాన్‌ను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించినట్లు పోలీసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మత్తుపదార్థం, నగదు, సెల్‌ఫోన్లు

మత్తుపదార్థం తరలిస్తున్న ఐదుగురు...

ప్యారిస్: చెన్నై కేకే నగర్ పోలీసులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం స్థానికంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ కారుని ఆపి అందులో ఉన్న ఐదుగురి వద్ద దర్యాప్తు చేశారు. వారి ప్రవర్తనపై అనుమానం కలగడంతో కారులో తనిఖీ చేసి మెథాంఫేటమైన్ అనే మత్తుపదార్థం గుర్తించారు. దీంతో కారులో ఉన్న అరుణ్‌కుమార్, రిజ్వాన్, నితిన్, షారుఖ్ బాషా, సయ్యద్ నూర్‌ను అరెస్టు చేసి, వారి నుంచి 50 గ్రాముల మత్తుపదార్థం, ఐదు సెల్‌ఫోన్లు, కారు, రూ.19,480 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు...

ప్యారిస్: చెన్నై అరుంబాక్కం పోలీసులకి అందిన సమాచారం మేరకు అరుంబాక్కం వంద అడుగుల రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో తనిఖీ చేపట్టారు. అందులో నివాసం ఉంటున్న రాజశేఖర్ అనే వ్యక్తి వద్ద 5 గ్రాముల మెథాంఫేటమైన్ అనే మత్తుపదార్థం ఉండటంతో అతన్ని అరెస్టు చేశారు. అతని నుంచి మత్తుపదార్థం, 55 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సెయింట్ థామస్ మౌంట్ పోలీసులు అసినూర్ షేక్ అనే వ్యక్తి నుంచి 3 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నటి సోనా ఇంట్లో చోరీకి యత్నించిన ఇద్దరు...

ప్యారిస్: చెన్నై మధురవాయల్‌లోని సినీనటి సోనా ఇంటి ప్రహరీ దూకి గురువారం సాయంత్రం ఇద్దరు దొంగలు ఇంట్లోకి చొరబడటానికి యత్నించారు. శబ్దం విని సోనా బయటకు రావడంతో కత్తితో ఆమెను బెదిరించి పారిపోయారు. సోనా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులు లోకేష్, శివను అరెస్టు చేశారు. ఈ మేరకు శనివారం పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు.



లోకేష్, శివ

గుట్కా తరలిస్తున్న ఇద్దరు...

ప్యారిస్: చెన్నై మడిప్పాక్కం పోలీసులు శుక్రవారం మడిప్పాక్కం బస్టాండు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ వైపుగా వచ్చిన కారుని ఆపి తనిఖీ చేసి 1014 కిలోల గుట్కా, రెండు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న రాజేష్, గౌతమిలను అరెస్టు చేశారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శనివారం ఉదయం చిన్నశేష వాహనసేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను తితిదే ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. ఇందులో ప్రొఫెసర్ ఘనకోటి వేంకటశాస్త్రి రచించిన 'శ్రీ మద్భాగవతం, వైజ్ఞానిక విశ్లేషణ', డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ రచించిన 'పురాణాలు-పరిశీలనాంశాలు', ప్రొఫెసర్ ఎం.రాజగోపాలాచారి ఆంగ్లంలో రచించిన 'ఎటర్నల్ గ్లోరీ ఆఫ్ తిరుమల', వావిలికొలను సుబ్బారావు రచించిన 'భగవదారాధన విధానము' పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తితిదే మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణ శర్మ, ఉప సంపాదకులు డాక్టర్ నరసింహాచార్య పాల్గొన్నారు.